## క్లుప్తంగా

### ఘనంగా అన్నాభిషేకం



షిర్డీసాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు, భక్తులు

రామభద్రపురం: కార్తీక మహోత్సవం పురస్కరించుకుని, స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయంలో అన్నాభిషేకం గురువారం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు 2 క్వింటాళ్ల అన్నంతో గుర్ల సాయిసుందరస్వామి చేతులమీదుగా బాబాకు అభిషేకం చేయించారు. ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు దంపతులతో పాటు చాలామంది భక్తులు బాబాను దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

### సూర్యనారాయణకు ఘననివాళి



సూర్యనారాయణ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

రామభద్రపురం: మండలం కేంద్రంలో జెడ్పీ, బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చొక్కాపు సూర్యనారాయణ వర్ధంతి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సోదరుడు ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, కుటుంబ సభ్యులు కలిసి సూర్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం 3 వేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో సూర్యనారాయణ భార్య జానకమ్మ, కుటుంబ సభ్యులు చొక్కాపు రామకృష్ణ, చొక్కాపు శ్రీనివాసరావు, చొక్కాపు రామలింగేశ్వరరావు, చింతల సింహాచలంనాయుడు, మత్స చంద్రమౌళీశ్వరరావు, చింతల రామకృష్ణ, సీహెచ్ మాలతి, సీహెచ్ మాధురి తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా బాలల హక్కుల వారోత్సవాలు



ఉంగరాడలో ర్యాలీలో అంగన్‌వాడీ కార్యకర్త, బాలలు

రేగిడి: మండలంలోని బూరాడ, రేగిడి, సంకిలి, ఉణుకూరు సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలల హక్కుల వారోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు బాలల హక్కులు తెలిపి, వాటిపై పిల్లలకు అవగాహన కల్పించారు. అనంతరం వీధుల్లో బాలలతో ర్యాలీలు చేపట్టి, బాలల సంరక్షణకు ఉన్న చట్టాలు, వాటి వినియోగం, బాలల దినోత్సవం ప్రాముఖ్యత వివరించారు.

### విగ్రహావిష్కరణ



గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పాఠశాల సిబ్బంది, రెడ్‌క్రాస్ సభ్యులు

వంగర: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. రాజాం ప్రాంతానికి చెందిన రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ ఈ విగ్రహాన్ని పాఠశాలకు సమకూర్చగా, దీనిని ప్రధానోపాధ్యాయురాలు ముద్దాడ రమణమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు పెంకి చైతన్యకుమార్, యూఎస్ యాదవ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

### ధాన్యం వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు



ధాన్యం తరలించేందుకు సిద్ధం చేసిన ట్రాక్టరుకు జీపీఎస్ పరికరం అమర్చుతున్న వ్యవసాయ శాఖ ఏడీ శ్యామసుందర్

బొబ్బిలి: మండలంలోని కారాడ, అలజంగి గ్రామాల్లో రైతులు తమ ధాన్యం తరలించేందుకు ఏర్పాటు చేసుకున్న వాహనాలకు జీపీఎస్ పరికరాలు గురువారం అమర్చారు. వ్యవసాయ శాఖ ఏడీ శ్యామసుందర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు బయలుదేరే వాహనాలకు ఈ పరికరాలు ఏర్పాటు చేసుకుంటే మన వాహనం ఎక్కడుందో ట్రాక్ చేసి, తెలుసుకోవచ్చన్నారు. ఈ పరికరాలు లేని వాహనాలకు ట్రక్ షీట్లు ఇవ్వడం జరగదన్నారు. రూ.2,920 చెల్లించి, పౌరసరఫరాల సంస్థ ద్వారా ఈ పరికరాన్ని పొందవచ్చన్నారు.

# సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- సచివాలయ, ఆర్‌బీకే భవనాల ప్రారంభోత్సవంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- పార్టీ సామాజిక సాధికార బస్సుయాత్రకు విశేష స్పందన
- స్వచ్ఛందంగా ట్రాక్టర్లు, ఆటోల్లో తరలివచ్చిన జనం
- పార్టీ శ్రేణుల్లో ముందస్తు విజయోత్సాహం



రైతు భరోసా కేంద్రం సిబ్బందితో మాట్లాడుతున్న పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే జోగులు తదితరులు

రాజాం సిటీ/వంగర: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నెలకొల్పిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని బొద్దాం గ్రామంలో రూ.43.60 లక్షల వ్యయంతో కొత్తగా నిర్మించిన సచివాలయ భవనంతో పాటు రూ.23 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఆర్‌బీకే(రైతు భరోసా కేంద్రం) భవనాన్ని పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డితో కలిసి జెడ్పీ చైర్మన్ ప్రారంభించారు. అనంతరం ఆయన సచివాలయ ఉద్యోగులతో మాట్లాడి, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలను అడిగితెలుసుకున్నారు. అలాగే అర్హులై ఉండి, పథకాలు అందని వారు ఎవరైనా ఉన్నారా అని ఆరాతీశారు. ప్రజాసమస్యల పరిష్కారానికి ఎటువంటి వినతులు వచ్చినా, తక్షణమే స్పందించి వాటిని పరిష్కరించాలని ఉద్యోగులకు సూచించారు. గ్రామంలో రూ.1.30 కోట్ల విలువైన జల్‌జీవన్ మిషన్ పనుల ద్వారా ప్రతీ ఇంటికి తాగునీరు అందేలా చర్యలు వేగవంతం చేయాలని తెలిపారు. సేంద్రియ వ్యవసాయం ప్రోత్సహించే దిశగా రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. గ్రామాల్లోని సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు పారదర్శకంగా అందుతున్నాయన్నారు. వీటితో ప్రజలంతా సంతృప్తిగా ఉన్నారన్నారు. అంతకుముందు గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు, పార్టీ రాజాం నియోజకవర్గ పరిశీలకుడు పేరాడ తిలక్, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, వైఎస్సార్ సీపీ యువ నాయకులు తలే రాజేష్, కంబాల సందీప్, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైఎస్సార్ సీపీ రాజాం రూరల్, టౌన్ కన్వీనర్‌లు లావేటి రాజగోపాలనాయుడు, పాలవలస శ్రీనివాసరావు, సర్పంచ్ నక్క తవిటమ్మ, మండల ప్రత్యేకాధికారి సుధాకర్, డీపీవో నిర్మలాదేవి, ఎంపీడీవో బాసూరి శంకరరావు, ఏఓ ఎం.రేణు కాసాయి తదితరులు పాల్గొన్నారు.



రాజాం: పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులతో కిక్కిరిసిన సామాజిక సాధికార బస్సుయాత్ర

### ● ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

రాజాం సిటీ: సామాజిక సాధికార బస్సుయాత్రలో భాగంగా మండలంలోని బొద్దాం గ్రామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. గ్రామం నుంచి ప్రారంభమైన ఈ బస్సుయాత్రలో తొలుత మహిళలు ప్రదర్శించిన కోలాటం, బిందెల డ్యాన్స్, కాంగో వాయిద్యాల ప్రదర్శన అలరించాయి. చిన్నారులు కూడా మేము సైతం అంటూ పార్టీ జెండాలు పట్టుకుని, సందడి చేయగా, కాంగో డప్పుల దరువుకు వృద్ధులు సైతం తమదైన శైలిలో డ్యాన్సులు వేసి, పార్టీపై తమకున్న అభిమానం చాటుకున్నారు.



రాజాం సిటీ: ఆకట్టుకున్న మహిళల కోలాటం



పార్టీ జెండాతో చిన్నారి



రాజాం సిటీ: కాంగో వద్ద డ్యాన్స్ చేస్తున్న వృద్ధుడు



రాజాం సిటీ: అలరించిన బిందెల డ్యాన్స్

### ● యాత్ర.. జోష్..

రాజాం/ సిటీ/ రేగిడి/సంతకవిటి/వంగర: రాజాంలో గురువారం జరిగిన వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సుయాత్ర నియోజకవర్గ పార్టీ నేతలు, కార్యకర్తల్లో సరికొత్త జోష్ నింపింది. ఓ వైపు వరికోత పనులు ముమ్మరంగా జరుగుతున్నప్పటికీ పెద్దఎత్తున కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రతీ గ్రామంలోని ప్రతీ ఇంటి నుంచి ఇద్దరు, ముగ్గురు చొప్పున స్వచ్ఛందంగా యాత్రకు తరలివచ్చి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మేమున్నామన్న భరోసానిచ్చారు. దీంతో మరోసారి పార్టీ విజయం ఖాయమన్న ధైర్యం పార్టీ శ్రేణుల్లో కనిపించింది.

**అడుగడుగునా నీరాజనం..**

రాజాం మండలంలోని బొద్దాం గ్రామం వద్ద ప్రారంభమైన సామాజిక సాధికార బస్సుయాత్రకు అడుగడుగునా జనం నీరాజనం పలికారు. యాత్ర ప్రారంభానికి ముందే శ్రీకాకుళం రోడ్డులోని హీరోహోండా షోరూం నుంచి బొబ్బిలి జంక్షన్ వరకు రోడ్డంతా జనాలతో నిండిపోయింది. మరోవైపు పాలకొండ రోడ్డులో జీఎంఆర్ ఐటీ కూడలి వద్ద వాహనాల పార్కింగ్ చేసినప్పటికీ ఆ వైపుగా ఉన్న ప్రాంతాల నుంచి యాత్రకు వచ్చే జనంతో ఆ రోడ్డు మొత్తం కిటకిటలాడింది. ఇదిలా ఉండగా, ఎమ్మెల్యే కంబాల జోగులు పార్టీ శ్రేణులతో కలిసి రాజాం పట్టణంలోని అంబేడ్కర్, వైఎస్సార్, బాబు జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.



సామాజిక సాధికార బస్సుయాత్రకు తరలివస్తున్న పార్టీ శ్రేణులు



రాజాం: బస్సుయాత్రకు వెళ్తున్న దివ్యాంగుడు

### ● ఉప్పొంగిన అభిమానం..

వంగర/సంతకవిటి/రేగిడి: మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి పెద్దఎత్తున పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు రాజాంలో జరిగిన సామాజిక సాధికార బస్సుయాత్రకు బయలుదేరారు. వేలాది మంది ట్రాక్టర్లు, ఆటోల్లో స్వచ్ఛందంగా తరలివెళ్లి, పార్టీపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు.



వంగర: పార్టీ జెండాలతో రుషింగి నుంచి సామాజిక సాధికార బస్సుయాత్రకు తరలివెళ్తున్న నేతలు, కార్యకర్తలు



సంతకవిటి: సంతకవిటి మండల కేంద్రం నుంచి చిరునవ్వుతో బయలుదేరిన పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు



రేగిడి: ఆమదాలవలస నుంచి రాజాం బయలుదేరిన పార్టీ నేతలు, కార్యకర్తలు

## ఉత్సాహంగా వ్యాసరచన పోటీలు



రాజాంలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



బాడంగి: గ్రంథాలయోద్యమకారుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న దృశ్యం

రాజాం/సంతకవిటి/రేగిడి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయాల్లో విద్యార్థులకు గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ నెల 20వ తేదీ వరకు జరిగే ఈ వారోత్సవాల్లో రోజుకో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, వారోత్సవాల ముగింపు రోజున విజేతలకు బహుమతులు అందజేస్తామని లైబ్రేరియన్లు తెలిపారు. సంతకవిటిలో చిత్రలేఖనం పోటీలు చేపట్టారు.

బాడంగి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయోద్యమకారుల సంస్మరణ సభ గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రంథాలయోద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య, గ్రంథాలయోద్యమకారులు పాటూరి నాగభూషణం, ఎస్.ఆర్.రంగనాథం తదితర చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయ స్థాపనలో వారి కృషిని కొనియాడారు.

## 23న సామాజిక సాధికార బస్సుయాత్ర

బాడంగి: బొబ్బిలిలో ఈ నెల 23వ తేదీన సామాజిక సాధికార బస్సుయాత్ర నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మినాయుని వెంకటనాయుడు ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. బస్సుయాత్ర ఏర్పాట్లపై చర్చించేందుకు మండల కేంద్రంలో ఈ నెల 18వ తేదీన పార్టీ మండల స్థాయి నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఉంటుందని, సమావేశానికి అందరూ హాజరుకావాలని కోరారు.

**సన్నాహక సమావేశం..**

బొబ్బిలి: సామాజిక సాధికార బస్సుయాత్ర నేపథ్యంలో స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు బొడిగంజి రమేష్‌నాయుడు అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశానికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ముఖ్య అతిథిగా హాజరై, కార్యక్రమ విజయవంతానికి పార్టీ శ్రేణులను దిశానిర్దేశం చేశారు. ప్రతీ ప్రాంతం నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు బస్సుయాత్రకు హాజరై, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైస్ చైర్మన్లు చెలికాని మురళి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి: పార్టీ నేతలను దిశానిర్దేశం చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

## 11 మంది వ్యాపారులపై కేసు నమోదు

వంగర: తూనికలు, కొలతల్లో తేడాలు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బొబ్బిలి తూనికలు, కొలతల విభాగం ఇన్‌స్పెక్టర్ ఎ.బలరామకృష్ణ హెచ్చరించారు. గురువారం మండలంలోని వంగర, కొప్పరవలస, ఎం.సీతారాంపురం గ్రామాల్లో తూనిక యంత్రాలను పరిశీలించిన ఆయన తూనికలు, కొలతల్లో మోసాలకు పాల్పడుతున్న 11 మంది వ్యాపారులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం వంగరలో తూనిక గుళ్లకు, ఎలక్ట్రానిక్ యంత్రాలకు వేస్తున్న సీళ్లను పరిశీలించారు.



తూనిక యంత్రాలకు వేస్తున్న సీళ్లను పరిశీలిస్తున్న తూనికలు, కొలతల విభాగం ఇన్‌స్పెక్టర్ బలరామకృష్ణ

## 27 నుంచి కులగణన

బొబ్బిలి: స్థానిక పట్టణంలో ఈ నెల 27వ తేదీ నుంచి కులగణన చేపట్టనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఇదే విషయమై స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో గురువారం సమావేశమైన ఆయన కార్యక్రమ నిర్వహణపై పలు సూచనలు, సలహాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపడుతున్న ఈ కార్యక్రమం పక్కాగా చేపట్టాలని సూచించారు.

## అప్రెంటీస్ మేళా రేపు

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 18వ తేదీన అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈఐడీ ప్యారీ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఐటీఐ పూర్తి చేసిన ఎలక్ట్రీషియన్, వెల్డర్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఫిట్టర్ ట్రేడ్ అభ్యర్థులు అర్హులన్నారు. మేళాకు రావాల్సిన వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు వాటి జిరాక్స్ కాపీలను కూడా తీసుకురావాలని కోరారు.

## ఎమ్మెల్యే పరామర్శ

రామభద్రపురం: అనారోగ్యంతో స్థానిక ఈశ్వరాలయ అర్చకులు బాదంపూడి బుచ్చయ్యశర్మ గురువారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆయన ఇంటికి చేరుకుని, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట మండల సచివాలయ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, ఎంపీటీసీ వసంతుల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని బాబానగర్‌కు చెందిన పక్కి వాసు మాస్టారును శిష్టకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూషా పట్నాయక్ గురువారం పరామర్శించారు. ఇటీవల వాసు మాస్టారు కుమారుడు పక్కి వెంకటసాయి అభిరామ్ చెన్నైలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ మేరకు బాధిత కుటుంబాన్ని ఆమె, కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘ కార్యదర్శి కె.సాయిరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఆర్‌బీకే ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

తెర్లాం: రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని ఎం.ఆర్.అగ్రహారంలో రూ.23.97 లక్షల వ్యయంతో కొత్తగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని, ఆయన ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. సచివాలయాలకు అనుసంధానంగా ఆర్‌బీకే(రైతు భరోసా కేంద్రం)లు, వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి, ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభతరం చేశారన్నారు. ప్రస్తుత ఆర్‌బీకేల ద్వారా రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందడమే కాకుండా పంట సమయంలో అధిక దిగుబడులకు తగిన సలహాలు, సూచనలు కూడా అందుతున్నాయన్నారు. వీటితో పాటు పంట విక్రయం కూడా ఇక్కడే చాలా సులువుగా జరుగుతున్నాయన్నారు. ఆర్‌బీకే సేవలతో రైతులు సంతృప్తిగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో బొబ్బిలి, తెర్లాం ఎంపీపీ ప్రతినిధులు ఎస్.వేణుగోపాలనాయుడు, ఎన్.బాబ్జీరావు, జెడ్పీటీసీ ప్రతినిధి జి.రామారావు, పార్టీ మండల అధ్యక్షుడు టి.సత్యంనాయుడు, సర్పంచ్ లక్ష్మి, ఎంపీడీవో అప్పారావు, ఈవోపీఆర్‌డీ నీలిమ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌బీకే భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

## చురుగ్గా 'వై ఏపీ నీడ్స్ జగన్'



మెంటాడ: ఇంటింటికీ వెళ్లి, ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తున్న ఎంపీపీ సన్యాసినాయుడు

తెర్లాం: మండలంలోని గంగన్నపాడు గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు తదితరులు కలిసి, ఇంటింటికీ వెళ్లి, నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును క్షుణ్ణంగా వివరించారు. ముఖ్యంగా ప్రభుత్వ ద్వారా ఏ ఇంటికి ఎంత మేర లబ్ధి జరిగిందో తెలిపారు. వచ్చే ఎన్నికల్లోనూ సీఎం జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు.

మెంటాడ: మండలంలోని ఆండ్ర గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే)కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఇంటింటికీ వెళ్లి, నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని, వచ్చే ఎన్నికల్లోనూ ఆయననే మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని ఆయన కోరారు.



గంగన్నపాడులో ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరిస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు సత్యంనాయుడు